క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



నారాయణపేట: స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా గురువారం స్థానిక మున్సిపాలిటీలోని 21, 22 వార్డు పరిధిలో ప్రధాన డ్రెయినేజీలో దోమలు నివారణకు మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీధర్, సిబ్బందిచే ఆయిల్ బాల్స్ వేయించారు. అలాగే పిచ్చి మొక్కలు కలుపు తీగలు వంటివి తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ మేరకు.. మున్సిపల్ అధికారులు ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది ఏఎస్ఎం, ఆయా అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

నారాయణపేట రూరల్: గతంలో బీఆర్ఎస్ చేసిన తప్పులనే కాంగ్రెస్ కొనసాగిస్తూ రైతులకు అన్యాయం చేస్తుందని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్ అన్నారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో గురువారం రైతు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. గ్రామంలో రైతులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రైతుబరోసా, రుణమాఫీ హామీలను తుంగలో తొక్కి రైతన్నలను రోడ్డు పాలు చేస్తున్నారని వాపోయారు. మండల అధ్యక్షుడు సాయిబన్న, నర్సింహులు, శివప్ప, బాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్, ఓబప్ప, నవత్‌రెడ్డి పాల్గొన్నారు.

విష జ్వరాలపై ఇంటింటి సర్వే



కృష్ణా: మండలంలో గుడెబల్లూర్‌లో గురువారం ఎంపీడీఓ జానయ్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎస్ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రధానంగా ఇళ్లలో ఉన్నవారికి జ్వరాలు వస్తేవారి పేర్లను నమోదు చేసుకోని, వారికి అవసరమయ్యే వైద్యసేవలు అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో కూడా ఇలాంటి సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగుపై సూచనలు

కృష్ణా: మండలంలోని చేగుంటలో గురువారం మండల వ్యవసాయ అధికారులు రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల రుణమాఫీ తనిఖీలు, రుణమాఫీరాని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అదేవిధంగా రైతులకు పంటల సాగుపై తగిన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ సుదర్శన్‌గౌడ్, ఏఈఓ సునిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నారాయణపేట రూరల్: టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన అనంతయ్య గురువారం బులెరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్‌కు తరలిస్తుండగా పట్టణ శివారు ఎక్లాస్‌పూర్ వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. డీటీ ఆనంద్ పంచనామా తర్వాత 20 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు అవకాశం ఇవ్వాలి..

మరికల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు యువతకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రవి, ఆంజనేయులు, రామకృష్ణ అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. యువతను ప్రత్యక్ష రాజకీయల్లోకి తీసుకురావడం కోసం కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నం ఫలించాలంటే త్వరలో జరిగే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో యువత పోటీ చేసేలా అధిష్టానం కూడా పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలు

కోస్గి: సీఎం రేవంత్ సోదరుడు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీ చౌరస్తాలో కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. అలాగే మండల నాయకులు, కార్యకర్తలు గురువారం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాతో సన్మానించారు. మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్, మాస్టర్ శ్రీను, భానునాయక్, సలీం ఉన్నారు.



నిర్వహణపై నిర్లక్ష్యం

- ముసురు వర్షాలతో రోడ్లు గుంతలమయం
- రహదారులకు ఆక్రమిస్తున్న ముళ్లపొదలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



పేట శివారులో రోడ్డును ఆక్రమించిన ముళ్ల కంప,



కాన్‌కుర్తి మీపంలో ప్రధాన రహదారిపై వాలిన కంపచెట్లు

దామరగిద్ద: ప్రధాన రహదారులు నిర్వహణ లేక అధికారుల నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారాయి. వర్షాకాలం కావడంతో రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు రహదారులను ఆక్రమించడంతోపాటు పలుచోట్ల ఇసుక మేటలు వేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ముసురు వర్షాలతో రోడ్లపై వర్షం నీరు నిలిచి గుంతలు ప్రమాద భరితంగా మారడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నారాయణపేట నుంచి దామరగిద్ద వరకు 10కిలోమీటర్లు, దామరగిద్ద నుంచి కర్ణాటక అంతరాష్ట్ర రహదారి అయిన యానుగుంది వరకు పలుచోట్ల మలుపు వద్ద ముళ్లపొదలు ఇసుక మేటలతో తరుచూ ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురువుతున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం..

ప్రతి ఏటా రోడ్ల నిర్వహణ చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారులను ముళ్లపొదలు ఆక్రమించడంతోపాటు ఇసుక మేటలు గుంతలతో రహదారులు ప్రమాదభరితంగా మారాయి. వర్షాకాలం కావడం ముళ్లపొదలు రోడ్డుకు అడ్డంగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి దామరగిద్ద రహదారిలో కొండారెడ్డిపల్లి రెవెన్యు శివారులో ఎస్పీ కార్యాలయానికి ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న ప్రాంతంలో ముళ్లపొదలు రోడ్డును ఆక్రమించాయి. ఇటుక బట్టి, బొగుడరాళ్ల సమీపంలో పలుచోట్ల ముళ్లపొదలు రోడ్డువైపు వాలాయి. ఇక పంచాయతీరాజ్ రోడ్లను పట్టించుకునే వారే కరువయ్యారు. మండలంలోని స్రుజనాపూర్, మల్‌రెడ్డిపల్లి, లోకూర్తి, అన్నాసాగర్, చాకలోన్‌పల్లి, కందెన్‌పల్లి తదితర గ్రామాలకు వెళ్లే గ్రామ పంచాయతీ రోడ్లపై వాలిన జంగల్‌కటింగ్ చేపట్టక కంపచెట్లు రోడ్డును ఆక్రమించారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమ గ్యాంగ్‌మెన్‌లతో రోడ్ల నిర్వహణ చేపడతామన్న చేపట్టక పోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనంగా మిగుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని ద్విచక్రవాహనదారులు కోరుతున్నారు.

ముళ్లపొదలను తొలగించాలి



రోడ్డు పక్కన ముళ్లపొదలు పెరిగి రోడ్లపైకి వాలాయి. నిత్యం ద్విచక్ర వాహనాలపై కూరగాయలు నారాయణపేట మార్కెట్‌కు తీసుకెళ్తుంటా, మలుపువద్ద ఎదురుగా వచ్చేవాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు కంపచెట్లను, గుంతలను పూడ్చిరోడ్లు ప్రమాదాలు జరగకుండా చేపట్టాలి. - అడ్డన్ అనంత్‌రెడ్డి, రైతు, దామరగిద్ద

రోడ్డు నిర్వహణ చేపట్టడం లేదు..



ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల నిర్మాణం చేపట్టిన తరువాత వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రతి ఏటా ఆర్‌అండ్‌బీ అధికారులు గ్యాంగ్‌మెన్‌ల ద్వారా జంగల్‌కంటింగ్, గుంతల పూడ్చివేత వంటి రోడ్ల నిర్వహణ చేపట్టాలి. - గవినోళ్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్, బాపన్‌పల్లి

త్వరలోనే నిర్వహణ చేపతాం

ప్రధాన రహదారులపై పలుచోట్ల జంగల్‌కటింగ్ చేపట్టాల్సి ఉంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో చెట్లుపెరిగి రోడ్డును ఆక్రమించిన మాట వాస్తవమే. ప్రమాదాల నివారణకు రోడ్డుపై వాలిన ముళ్లపొదలు తొలగించేందుకు ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు తో టెండర్ వేశాం త్వరలోనే పనులు చేపడతాం. - రాములు, డీఈ ఆర్‌అండ్‌బీ

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ

మరికల్: స్వచ్ఛదనం- పచ్చదనంతోనే గ్రామాల్లో పర్యావరణం కాపాడుకోగలమని శిక్షణ కలెక్టర్ గిరిమానరుల అన్నారు. మండలంలోని అప్పంపల్లిలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాల, హెల్త్‌సెంటర్ వద్ద మొక్కలను నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు గ్రామస్తుల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. రహదారులు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. అలాగే మండలంలో కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీల్, ఎంపీడీఓ పావని, ఆర్ఐ శ్రీశైలం పాల్గొన్నారు.



అప్పంపల్లిలో మొక్కలు నాటుతున్న శిక్షణ కలెక్టర్ గిరిమానరుల

విజయరాజ్ తిలక్ సురూజీకి నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కున్సి గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని కున్సి గ్రామానికి చెందిన జైన మత గురువు విజయరాజ్ తిలక్ సురూజీ అలియాస్ సాయిబన్న (102) గత మంగళవారం మృతి చెందారు. గురువారం గ్రామానికి చెందిన అఖిల పక్షం నాయకులు, బాల్‌రాజ్ తిలక్ సూరుజీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈమేరకు.. నాయకులు మాట్లాడుతూ.. విజయరాజ్ తిలక్ సురూజీతో తమ గ్రామానికి పేరుప్రతిష్టలు లభించాయన్నారు. ఆయన హితబోధ వల్లే గ్రామంలో చాలా మంది మద్యం, మాంసానికి దూరంగా ఉన్నారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అనుసూయమ్మ, మాజీ సర్పంచ్‌లు అంజప్పగౌడ, సోమశేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాంచందర్, ఆలయ కార్యవర్గసభ్యులు శివప్పసోకార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, రాంలింగప్ప, శరణగౌడ, నల్లె నర్సప్ప, ధర్మరాయ, రాంచందర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నారాయణపేట: జనగామలో ఇద్దరు న్యాయవాదులపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ మూడోరోజు గురువారం పేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. జనగామలో ఒక కేసు విషయంలో న్యాయవాదులు కవిత, అమృతరావు సీఐ, ఎస్ఐ సిబ్బంది వారిపై సోమవారం దాడిని బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడిచేసిన సీఐ, ఎస్ఐ సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి భీం రెడ్డి, కో–శాధికారి శ్రీనివాస్, న్యాయవాదులు సీతారామారావు, మదన్, నారాయణ, రాజవర్ధన్‌రెడ్డి, విజయ్‌భాస్కర్ రెడ్డి, సతీష్ గౌడ్, మహబూబ్ అలీ, కూర్మన్నగౌడ్, ప్రవీణ్ నామాజీ, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ

నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ శివారులోని లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం పట్టణంలోని సోమశేఖరస్వామి ఇంటి నుంచి అమ్మవారి పల్లకిసేవా కనుల పండువగా ఆలయం వరకు కొనసాగింది. పట్టణ పురవీధుల గుండా భజన సంకీర్తనలతో ముందుకు సాగుతుండగా, భక్తులు పెద్దఎత్తున హాజరై దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నెలరోజుల పాటు ప్రతి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రాంబాబు, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కో–షాధికారి అశోక్, నర్సింహులు, చంద్రశేఖర్, దినేష్‌లాహోటీ, రాంరెడ్డి పాల్గొన్నారు.



అమ్మవారి పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

సరస్వతి ఆలయ కడప ముహూర్తం

మరికల్: మండల కేంద్రంలోని రాయచూర్ రోడ్డు పక్కన నిర్మిస్తున్న నూతన సరస్వతి ఆలయ కడప ముహుర్తం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆలయ సభ్యులు సుందరయ్యశర్మ మంత్రోచ్ఛరణాల మధ్యన కడపకు ప్రత్యేక పూజలు చేయగా ఆలయ నిర్వాహకులు కడపను ప్రతిష్ఠించి పూజలు చేశారు. కృష్ణయ్య, బసంత్, తిరుపతయ్య, జగదీష్, వీరన్న, సూర్యమోహన్, హరీష్, కొండారెడ్డి, రాజేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ధన్వాడ: మండలంలోని రామకిష్టాయిపల్లిలో గురువారం బొడ్రాయి నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా కొనసాగాయి. ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య పూజలు చేశారు. గ్రామంలో రూ.18లక్షల వ్యవయంతో నిర్మించిన పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేసి దంపతులతో యజ్ఞం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల గుండా బొడ్రాయి, విగ్రహ ప్రతిమలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పురోహితులు మల్లేష్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, నారాయణరెడ్డి, రాజు, ఒగ్గురాజు, జమ్ములప్ప, వెంకటయ్య, ఎర్రమల్లప్ప, చిన్నబాలప్ప, జములప్ప, కొత్రబాలప్ప, యాదిరెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్తులు

వధూవరులను ఆశీర్వదించిన కలెక్టర్



ఊట్కూర్: మండలంలోని పాతపేట హనుమాన్ మందిర్‌లో గురువారం తన వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న తాయప్ప సోదరుడి వివాహానికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులు అశోక్ లవాణ్యలకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ



కోస్గి: గ్రామీణప్రాంతాల్లో ఎందరో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఉంటారని, వారి ప్రతిభను గుర్తించి ప్రొత్సహించడం ద్వారా మరింత ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఏకేఎస్ అకాడమి అధినేత అంజయ్య యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం గుండుమాల్ మండల కేంద్రంలో వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్, క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. నిర్వాహకులు సాధిక్, మహ్మద్ అలీతోపాటు పలువురు పాల్గొన్నారు.

మైక్రోస్కోప్ వితరణ



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలకు గురువారం స్నేహ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి మైక్రోస్కోప్‌ను ఉపాధ్యాయులకు అందించారు. ఈ మేరకు.. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గతకొంత కాలంగా పాఠశాల విద్యార్థులు మైక్రోస్కోప్ లేక ఇబ్బందులు పడుతున్నారని, గురువారం స్నేహ ఫౌండేషన్ వారు అవసరమయ్యే నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్స్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గణేష్‌సింగ్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, స్నేహ ఫౌండేషన్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నారాయణపేట రూరల్: పర్యావరణంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించుకుని పరిరక్షించుకోవాలని మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ అన్నారు. మున్సిపాలిటీ నుంచి పట్టణంలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల, శ్రీహంసవాహిని స్కూల్‌లలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను కలిగి ఉండాలని, విద్యాలయాల్లో స్వచ్ఛత పాటించడంలో పిల్లలను భాగస్వాములను చేయాలన్నారు. వార్డు ఆఫీసర్ బట్టి ఆంజనేయులుగౌడ్, ప్రిన్సిపాల్స్ పద్మ, రాజేష్‌కుమార్, అధ్యాపకులు సుజాత, నమ్రత, ఉషా, భారతి, అఖిల పాల్గొన్నారు.



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న రాపిడ్‌యాక్షన్ బలగాలు

మరికల్: సమాజంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో సమస్యాత్మకమైన గ్రామాలైన చిత్తనూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో సాయంత్రం ఎస్పీ ఆదేశాలమేరకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ మేరకు.. సీఐ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో మనోధైర్యం కల్పించడంతో పాటు గ్రామాల్లో ప్రశాంత వాతావారణం నెలకొల్పేందుకు పోలీస్‌శాఖ నిత్యం పనిచేస్తుందన్నారు. మండలంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే సంఘటన స్థలానికి రాపిడ్ యాక్షన్‌ఫోర్స్ బలగాలు చేరుకుంటాయన్నారు. ప్రజల భద్రతపై భరోసా కల్పించడం కోసం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినోద్, ఆర్ఎఫ్‌సీఐలు రోషన్, రాజు, ఎస్ఐ మురళి, ఏఎస్ఐలు ఎల్లయ్య, కృష్ణయ్య, పోలీసులు పాల్గొన్నారు.

కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సునీత

నారాయణపేట రూరల్: కుక్కల జోలికి చిన్నారులు వెళ్లకుండా తల్లిదండ్రులు, టీచర్లు తగిన జాగ్రత్తలు తెలియజెప్పాలని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్‌లేన్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. అనవసరంగా కుక్కల జోలికి వెళ్లొద్దని, ఆటపట్టించడం వంటివి చేయడంతో వాటికి కోపం వచ్చి ఎదురుతిరిగే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ క్రమంలో కుక్కకాటుతో రెబిస్ వ్యాధి వస్తుందని చెప్పారు. కుక్కలు ఉన్న చోటు నుంచి వెళ్లే సమయంలో మనకు కుక్కకు మధ్యలో ఏదైన వస్తువు ఉంచుకునే ప్రయత్నం చేయాలని, పెంపుడు కుక్కలకు సైతం టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన టీచర్‌కు సన్మానం



నారాయణపేట రూరల్: మరికల్ జెడ్పీస్కూల్‌లో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు మఠం శివశంకర్ ఇటీవల భారతదేశ ఆర్థికాభివృద్ధిలో భారతీయ పారిశ్రామిక రంగం పాత్ర – టెలికాం సెక్టార్‌పై అధ్యాయనం అనే అంశంపై చేసిన పరిశోధనకు రిటైర్డ్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ గైడెన్స్‌లో డాక్టరేట్ పొందారు. ఈమేరకు డీఈఓ కార్యాలయంలో ఆయనను సోసల్‌ఫోరం టీచర్లు డీఈఓ ఎండీ అబ్దుల్ఘుని చేతుల మీదుగా శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి, జీసీడీఓ పద్మనళిని, సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రవికుమార్, నర్సింహ, శ్రీనివాస్, అశోక్, ధనుంజయ, వెంకటేష్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పేటలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చందన



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ కీర్తి

నారాయణపేట రూరల్: వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను మురుగు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ చందన అన్నారు. గురువారం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో కోటకొండలో ఫ్రైడే–డ్రై డే కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు.. పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. సునంద, ప్రభావతి, సరస్వతి, ఏఎన్ఎం అనురాధ పాల్గొన్నారు.

ధన్వాడ: ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని దీంతో రోగాలు వచ్చే అవకాశం తగ్గుతుందని పీహెచ్‌సీ డాక్టర్ కీర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలను వేశారు. అలాగే మండలంలోని కిష్టాపూర్, కొండాపూర్, చర్లపల్లి, మందిపల్లి గ్రామాల్లో విద్యార్థులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేక అధికారి సాయిప్రకాష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల్లో నీళ్ల నిల్వ ఉన్నచోట అయిల్‌బాల్స్ వేయడం, మురుగు కాల్వలను పరిశుభ్రం చేయడం తదితర కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ సాయిప్రకాష్, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, డాక్టర్ మునిర్ అహ్మద్, నందిని, కతలప్ప, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



మద్దూరులో..

మద్దూరు: స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా గురువారం మండల వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లోని ప్రజలకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటిచుట్టూ పక్కల నీరునిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. మద్దూరులో మండల వైద్యాధికారాణి శ్రీలత, ఎంపీఓ రామన్న, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త చట్టం బుక్కుల పంపిణీ



నారాయణపేట: భారత ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం తెలుసుకునే పుస్తకాలను పేట బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నందునామాజీ గురువారం పలువురు న్యాయవాదులకు పంపిణీ చేశారు. ఈ మేరకు.. జూనియర్ లాయర్లు కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కొత్త చట్టం పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణ, కుర్మన్నగౌడ్, శివరాజ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

కాకర్లకు అయ్యప్ప భక్తుల సన్మానం

నారాయణపేట: అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్యకు కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ అయ్యప్ప గురుస్వాము లు ఆలయ సన్నిధానంలో గురువారం సన్మానం చేశారు. నీ గానమే నా ప్రాణం 41 భజన కార్యక్రమం సందర్భంగా గురుమిట్కల్ గురుస్వాములు బుగ్గప్ప, నరసప్ప, ముదేలి గురుస్వామి దేవేంద్రప్ప ఈ సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు.



కాకర్ల భీమయ్యను సన్మానిస్తున్న గురుస్వాములు

ఉచిత ట్యూషన్ ప్రారంభం

మరికల్: మండల కేంద్రానికి చెందిన కుర్వ లంబడి రాములు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గురువారం నుంచి ఉచిత ట్యూషన్ తరగతులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులకు చేయుతను ఇవ్వడం కోసం ప్రతి రోజు రాత్రి గంట సమయం నైపుణ్యం కలిగిన ప్రైవేట్ ఉపాధ్యాయులచే 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉచితగా ట్యూషన్ చెప్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీరన్న, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆనంద్, శేఖర్ పాల్గొన్నారు.

అమరచింత పెద్దచెరువుకు సాగునీరు

అమరచింత: భూత్పుర్ రిజర్వాయర్ నుంచి అమరచింత పెద్ద చెరువుకు కాల్వల ద్వారా సాగునీరు చేరుతోంది. వర్షాకాలం సీజన్‌లోనే పంటల సాగు కోసం పెద్ద చెరువుకు సాగునీరు అందాలనే లక్ష్యంతో పట్టణానికి చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధుల ద్వారా కాల్వలోని ముళ్ల పొదలను తొలగించారు. దీంతో భూత్పురు రిజర్వాయర్ ద్వారా సాగునీరు అమరచింత చెరువుకు చేరుకోవడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రకాష్‌రెడ్డికి పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి

అమరచింత: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య గురువారం తుదిశ్వాస విడిచారు. దీంతో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్, సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి మాట్లాడుతూ 11 ఏళ్ల పశ్చిమబెంగాల్‌కు సీఎంగా ఉంటూ రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసిన మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు రాఘవేంద్ర, వెంకటేష్, రఘు, చంటి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.